సాక్షి ఆదిలాబాద్

మంగళవారం । 27 । ఫిబ్రవరి । 2024



చెరువు నీరే దిక్కు... 8లో▸

కొలాం గిరిజనులకు చెరువు నీరే దిక్కవుతోంది. బిందెడు నీటి కోసం వారి అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ఇందుకోసం నాలుగు కిలోమీటర్లు నడవాల్సిన దుస్థితి.

రేపు సైన్స్‌డే నిర్వహించాలి

ఆదిలాబాద్‌టౌన్: జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని ఈనెల 28న జిల్లాలోని అన్ని పాఠశాలల్లో తప్పనిసరిగా సైన్స్‌డే నిర్వహించాలని డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. సైన్స్‌డే సందర్భంగా విద్యార్థులకు సైన్స్, క్విజ్, ఆసక్తికరమైన సైన్స్ విషయాలు చెప్పడం, సైన్స్ ప్రయోగాల ప్రదర్శన, సైన్స్ మేళా తదితర కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

గరిష్టం/కనిష్టం
34.0/22.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం కనిపించనుంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: ఆదివాసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన 2024 సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టర్ రాహుల్ రాజ్ సోమవారం విడుదల చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరం వద్ద సంఘ బాధ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఇందులో సంఘం జిల్లా కార్యదర్శి సలాం వరుణ్, బాధ్యులు సందీప్, నాగోరావు, భీంరావు, నరేశ్, సునీల్, పాండు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

'ఫీజుల పేరుతో హాల్‌టికెట్లు నిలిపివేయడం సరికాదు'

ఆదిలాబాద్‌టౌన్: ఫీజుల పేరుతో హాల్‌టికెట్లు నిలిపివేయడం సరికాదని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కుమ్ర అశోక్ ప్రకటనలో తెలిపారు. కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు ఫీజులు, బస్సుఫీజులు చెల్లించాలని మానసిక వేధింపులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఓ కళాశాల యాజమాన్యం తల్లిదండ్రులు కన్నీరు పెడుతూ కాళ్ల మీద పడ్డా కనికరించకుండా ఫీజులు చెల్లించాల్సిందేనని, లేదంటే హాల్‌టికెట్ ఇవ్వమని బెదిరింపులకు గురి చేయడం బాధాకరమని తెలిపారు. తక్షణమే జిల్లా అధికారులు స్పందించి ఇప్పటివరకు హాల్‌టికెట్లు మంజూరు చేయని ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

టీబీ సంక్రమించకుండా జాగ్రత్తలు పాటించాలి




శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: టీబీ సంక్రమించకుండా వైద్య సిబ్బంది ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. టీబీ ముక్త్ భారత్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమంలో జిల్లా రెండో విడతలో ఎంపికైంది. రిమ్స్‌తో పాటు ఉట్నూర్ ఆస్పత్రి, గుడిహత్నూర్ పీహెచ్‌సీలను ఎంపిక చేశారు. ఇందులో భాగంగా అక్కడ పని చేసే సిబ్బందికి జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆడిటోరియంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. టీబీ రోగులు చికిత్స కోసం వచ్చినప్పుడు వారి నుంచి ఇతరులకు వ్యాపించకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచించారు. మూడు నెలలకోసారి కార్యక్రమం అమలు తీరును పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో మొదటి విడత సంగారెడ్డి, కరీంనగర్‌లో పూర్తి కాగా, రెండో విడత ఆదిలాబాద్ జిల్లాలో చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం రెండు రోజుల పాటు కొనసాగుతుందని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం రిమ్స్, ఉట్నూర్, గుడిహత్నూర్‌లో అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర శిక్షకులు డాక్టర్ సతీష్, ప్రమోద్ రెడ్డి, రాజసింగ్‌తో పాటు రిమ్స్ మైక్రోబయోలజి హెచ్‌వోడీ పద్మవల్లి వైద్య సిబ్బందికి శిక్షణ కల్పించారు. కార్యక్రమంలో రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్, ఆర్‌ఎంవో చందు, డాక్టర్ సుమలత పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: వైద్యారోగ్యశాఖ పరిధిలోని నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈనెల 28లోగా జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో అందించాలని పేర్కొన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు–3, డిస్ట్రిక్ట్ పీడీఎంటీ టీబీ హెచ్‌ఐవీ కోఆర్డినేటర్–1, మెడికల్ ఆఫీసర్–1, పీపీఎం కోఆర్డినేటర్–1, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం కోఆర్డినేటర్–1, సీనియర్ డాట్స్ ప్లస్ టీబీ హెచ్‌ఐవీ–1, టీబీహెచ్‌వీ–1 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. వివరాల కోసం adilabad. telangana. gov. in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

డీసీసీ పీఠం ఎవరికో..?





కంది శ్రీనివాస్‌రెడ్డి



గోక గణేశ్‌రెడ్డి



శ్రీకాంత్‌రెడ్డి

- ఆదిలాబాద్ ఇన్‌చార్జి 'కంది' గట్టి యత్నాలు
- గణేశ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి సైతం..
- అధిష్టానం ఎవరివైపు మొగ్గు చూపేనో

సాక్షి,ఆదిలాబాద్: జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్ష పదవి ఎవరిని వరిస్తుందోనని ప్రస్తుతం ఆ పార్టీలో ఆసక్తి నెలకొంది. త్వరలోనే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న డీసీసీ పదవులను భర్తీ చేసే యోచనలో పార్టీ ఉండడంతో ఇప్పుడు అందరి దృష్టి అటు వైపు మళ్లింది. ప్రస్తుతం పార్టీలో ఈ పదవి విషయంలో ముఖ్య నేతల మధ్య పోటీ నెలకొంది. వారి మధ్య భేదాభిప్రాయాలు చోటు చేసుకొని విభేదాలకు ఆస్కారమైంది. ఈ నేపథ్యంలో పోటీ పడుతున్న వారిలో నుంచే ఒకరిని అధ్యక్షుడిగా ఎంపిక చేస్తారా.. లేని పక్షంలో పార్టీ ఇంకా ఎవరైనా సీనియర్ నేతలను పరిగణలోకి తీసుకుంటుందా అనే చర్చ కూడా సాగుతుంది.

రేసులో వీరు..

కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అధ్యక్ష పదవి కోసం గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయనతో పాటు తలమడుగు జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి కూడా విస్తృత ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలో ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలు పూర్తిస్థాయిలో ఖానాపూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లోని రెండ్రెండు మండలాలు జిల్లా పరిధిలో ఉన్నాయి. గడిచిన శాసనసభ ఎన్నికల్లో నాలుగు నియోజకవర్గాల్లో పరిశీలిస్తే.. కాంగ్రెస్ పార్టీ పరంగా ఒక ఖానాపూర్‌లోనే పార్టీ అభ్యర్థి గెలుపొందాడు. ఆదిలాబాద్, బోథ్, ఆసిఫాబాద్‌లో పార్టీ అభ్యర్థులు పరాజయం పాలయ్యారు. రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యేలు లేని దగ్గర నియోజకవర్గ ఇన్‌చార్జీలకు ప్రాధాన్యతనిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం సంక్షేమ పథకాల అములులోనూ వారి అభిప్రాయాలనే పరిగణలోకి తీసుకుంటున్నారు. అంతే కాకుండా నామినేటెడ్ పోస్టుల భర్తీలోనూ వీరి సూచనలకే ఓకే చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లా అధ్యక్షుడి ఎంపికలోనూ ఖానాపూర్ ఎమ్మెల్యే, ఆదిలాబాద్, బోథ్, ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జీల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకునే పరిస్థితి ఉంది. ప్రధానంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సూచించిన వారికే పదవి దక్కే అవకాశం ఉందని పార్టీలో చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో ఆయన ఎవరివైపు మొగ్గు చూపుతాడనేది ఆసక్తికరమే.

ఎవరికి వారు ప్రయత్నాలు..

పార్టీ జిల్లా అధ్యక్ష పదవి విషయంలో ఆశావహులు మొదటి నుంచి సైలెంట్‌గా ఉన్నప్పటికీ ఇటీవల తమ ప్రయత్నాలకు జోరు పెంచారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షిని కలిసి అధ్యక్షుడి ఎంపికలో పరిగణలోకి తీసుకోవాలని ముఖ్య నాయకులు ఎవరికి వారే కలిసి కోరుతున్నారు. ఈ పీఠం దక్కించుకునే విషయంలో ఇద్దరు నేతల మధ్య భేదాభిప్రాయాలు చోటుచేసుకున్నాయని పార్టీలో ప్రచారం సాగుతుంది. ఈ నేపథ్యంలో అధ్యక్షుడి ఎంపిక విషయంలో ముఖ్య నేతల మధ్య ఏకాభిప్రాయం కష్టమేనన్న ప్రచారం ఉంది. ఈ పరిస్థితుల్లో అధిష్టానం ఇతరులను ఎవరినైనా పరిగణలోకి తీసుకునే అవకాశాలు లేకపోలేదన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతుంది. ఏదేమైనా త్వరలో పార్లమెంట్ ఎన్నికలు, ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు ఉండడంతో పార్టీకి దిశానిర్దేశం చేయడంలో అధ్యక్షుడి పాత్ర కీలకం కానుంది. ఈ నేపథ్యంలో అధిష్టానం నిర్ణయం ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది.

కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జిని కలిసిన జిల్లా నాయకులు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షిని పార్టీ జిల్లా నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ మండల, బ్లాక్, జిల్లా అనుబంధ విభాగాల చైర్మన్లు గాంధీ భవన్‌లో కలిశారు. డీసీసీ అధ్యక్షుడిగా కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డిని నియమించాలనే ఏకవాక్య తీర్మాణంతో కూడిన ప్రతిని ఆమెకు అందజేశారు. నియోజకవర్గంలో చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాలను వివరించారు. అనంతరం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను కలిసిన నాయకులు బేలలో ప్రత్యేక మార్కెట్‌యార్డు ఏర్పాటు చేయాలని నివేదించారు. ఇందులో కిసాన్ సెల్ రాష్ట్ర ప్ర ధాన శ్రీకాంత్‌రెడ్డి, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి, నాయకులు మహిమూద్ ఖాన్, ఆనంద్‌రావు, రాహుల్, శేఖర్, నవీన్‌రెడ్డి, నాగరాజు తదితరులు ఉన్నారు.

రెవెన్యూ సమస్యలే అధికం



సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ రాహుల్ రాజ్

- గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరించిన కలెక్టర్

కైలాస్‌నగర్: ఈ సారి ప్రజావాణిలో రెవెన్యూ సమస్యలే అధికంగా వచ్చాయి. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ రాహుల్‌రాజ్ అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా దరఖాస్తులను సంబంధిత అధికారులకు అందజేశారు. అర్జీలు పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ బాధితులకు భరోసా కల్పించాలని ఆదేశించారు. మొత్తం 18 దరఖాస్తులు అందగా ఇందులో అత్యధికంగా రెవెన్యూకు సంబంధించనవే 11 ఉన్నాయి. బీసీ సంక్షేమం, ఎంప్లాయ్‌మెంట్ శాఖలకు సంబంధించి ఒక్కోటి, ఐటీడీఏకు సంబంధించి 3, మున్సిపాలిటీకి సంబంధించి రెండేసి చొప్పున అర్జీలు అందాయి. కార్యక్రమంలో ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ వికాస్ మహతో, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ వారం అర్జీదారుల్లో కొందరి నివేదన..

అసైన్డ్ భూమిగా పట్టాలిచ్చారు



మేమంతా గొల్లఘాట్ శివారులోని భూమిని 1971లో ఓ వ్యక్తి నుంచి కొనుగోలు చేసి కాస్తు చేస్తున్నాము. పట్టాల కోసం దరఖాస్తు చేసుకోగా రెవెన్యూ అధికారులు పట్టేదారు కాలంలో రైతుల పేర్లు కాకుండా అసైన్డ్ భూమిగా పేర్కొంటూ పట్టా జారీ చేశారు. ఈ పట్టాలతో ప్రభుత్వ ప్రయోజనాలు పొందుతున్నప్పటికీ భూములను అమ్ముకునేందుకు అవకాశం లేకుండా పోయింది. పట్టాలో దాన్ని సరిచేసి మా భూములను అమ్ముకునేలా అవకాశం కల్పించి న్యాయం చేయాలి.

– పిప్పల్‌కోటి రైతులు, భీంపూర్

ఎంపికైనా ఉద్యోగాలు ఇవ్వడం లేదు



నేను ఇటీవల ఆర్మీ, ఎక్సైజ్‌శాఖలో ఉద్యోగాలకు ఎంపికయ్యాను. కానీ నాతండ్రి రాములును మిలిటెంట్‌గా పేర్కొంటూ నాకు ఆ ఉద్యోగాలను ఇవ్వడం లేదు. నా తండ్రికి మిలిటెంట్లతో ఎలాంటి సంబంధం లేదు. నాది నిరుపేద వ్యవసాయ కుటుంబం. ఉన్నతాధికారులు నాపై దయతలిచి ఆ ఉద్యోగాలు నాకు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నా.

– అంగ రాజు, దేవాపూర్, తలమడుగు

'ఉపాధి' అధికారిపై చర్యలు తీసుకోండి



జిల్లాలో ఉన్న ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల వివరాలు ఇవ్వాలని జిల్లా ఉపాధి కల్పన అధికారిని పలుమార్లు కోరినప్పటికీ పట్టించుకోవడం లేదు. ఆర్‌టీఐ ద్వారా అడిగిన దాటవేసే ప్రయత్నం చేస్తున్నారు. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల పేరిట అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అందుకు సహకరిస్తున్న జిల్లా ఉపాధి కల్పన అధికారిపై కూడా శాఖాపరంగా చర్యలు తీసుకోవాలి. ఈఎస్ఐ, ఈపీఎఫ్, చెల్లించని ఏజెన్సీలను సైతం రెన్యువల్ చేశారు. సక్రమంగా ఏజెన్సీలు నిర్వహించని వారిని బ్లాక్ లిస్టులో పెట్టాల్సి ఉండగా అలా చేయడం లేదు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న సదరు అధికారిపై తగు చర్యలు తీసుకోవాలి.

– రాజేందర్‌గౌడ్, మందమర్రి

1 వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు



ఆర్థిక అక్షరాస్యత అవగాహన పుస్తకాలు విడుదల చేస్తున్న కలెక్టర్, ఎల్‌డీఎం

- కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: ఆర్‌బీఐ ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి మార్చి1వ తేదీ వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన ప్రచార పోస్టర్లు, అవగాహన పుస్తకాలను కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకులు, విద్యాసంస్థల ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం 7గంటలకు జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి 2కే రన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా అధికారులు, బ్యాంకర్లు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అలాగే 28న ఉదయం 11గంటలకు పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఆర్థిక అక్షరాస్యత శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ భాస్కర్ ప్రసాద్, పరిశ్రమల శాఖ జీఎం పద్మ భూషణ్ రాజు, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి రాథోడ్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియో విజయవంతం చేయాలి

కైలాస్‌నగర్: మార్చి 3న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయాలని అధికారులకు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా టాస్క్ ఫోర్స్ సమన్వయ కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చేనెల 3 నుంచి మూడు రోజుల పాటు పోలియో చుక్కలు వేయనున్నట్లు పేర్కొన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేని వార్డులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గ్రామాలు, వార్డుల్లో టాంటాం వేయించి, అర్హులైన పిల్లలకు పోలియో చుక్కలు వేయించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఆదివారం కావడంతో సెలవుదినంగా భావించవద్దని అంగన్‌వాడీ టీచర్స్, సూపర్ వైజర్లు అందుబాటులో ఉండి పిల్లలకు చుక్కల మందు వేయించాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతమయ్యేలా శ్రద్ధ వహించాలన్నారు. జిల్లాలో ఐదేళ్లలోపు చిన్నారులు 77,155 మంది ఉన్నారన్నారు. అర్బన్ ఏరియాలో 81, రూరల్ ఏరియాలో 420, ట్రైబల్ ఏరియాలో 301 చొప్పున మొత్తం 802 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, పట్టణ ముఖ్య కూడళ్లలో ఆశ, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళా సంఘాలు అందుబాటులో ఉండాలన్నారు. మారుమూల ప్రాంతాలు, సంచార జాతులు, ఇటుకబట్టీలు, నిర్మాణ స్థలాలలోని చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. 4, 5 తేదీలలో ఇంటింటి సర్వే చేపట్టి చుక్కలు వేసుకోకుండా మిగిలిన వారికి వేయించాలన్నారు. ఇందులో డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహనేది?

- కరువైన ప్రచారం
- యంత్రాంగం నిర్లిప్తత
- యువత ఓటుకు దూరమయ్యే అవకాశం

జిల్లా ఓటర్లు: 4,54,450
ఇటీవల కొత్తగా నమోదైన ఓటర్లు: 4,470



ఓటరు దరఖాస్తులు స్వీకరిస్తున్న బీఎల్‌వోలు

కైలాస్‌నగర్: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిది. ఎన్నికల్లో పోటీ చేసే నాయకుల తలరాత మార్చగలిగే శక్తి ఒక్క ఓటుతోనే సాధ్యపడుతుంది. అంతటి కీలకమైన ఓటు హక్కును అర్హులైన ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం ఓటరు నమోదుకు పదే పదే అవకాశం కల్పిస్తోంది. త్వరలో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది ఏప్రిల్ నాటికి 18 ఏళ్ల నిండనున్న యువత ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఛాన్స్ ఇచ్చింది. అయితే దీనిపై క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం కల్పించాల్సిన జిల్లా అధికార యంత్రాంగం నిర్లిప్తంగా వ్యవహరిస్తోంది. ఎలాంటి అవగాహన కార్యక్రమాలు చేపట్టడంలేదు. దీంతో యువత ఓటు హక్కుకు దూరమయ్యే పరిస్థితి కనిపిస్తుందనే భావన సర్వత్రా వ్యక్తమవుతుంది.

యువతకు ఓటు హక్కు కల్పించేలా...

అర్హులైన యువతను ఓటర్లుగా మార్చేందుకు ఎన్నికల సంఘం దృష్టి సారించింది. పార్లమెంట్ ఎన్నికలకు త్వరలో షెడ్యూల్ వెలువడనున్న నేపథ్యంలో ఓటరుగా నమోదు, సవరణలకు అవకాశం కల్పించింది. ఇటీవల జిల్లా ఓటరు తుది జాబితా ప్రకటించినప్పటికీ మరోసారి ఓటు నమోదుకు అవకాశమిచ్చింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువత తమ పేరును ఓటరుగా నమోదు చేసుకునేందుకు చాన్స్ ఇచ్చింది. ఇలాంటి వారు ఫారం–6 ద్వారా సంబంధిత బీఎల్‌వోలకు నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. లేదా ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు అందించే అవకాశం ఉంది. ఏప్రిల్‌లో ఎన్నికలు జరిగే అవకాశమున్నందున అప్పటి వరకు నమోదు చేసుకున్న వారి వివరాలతో అనుబంధ ఓటరు జాబితాను ప్రకటించి వారు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఈసీ చర్యలు చేపడుతోంది.

కొరవడిన ప్రచారం ...

జిల్లాలో ఓటరు నమోదుపై ప్రచారం కొరవడింది. ప్రజలకు అవగాహన కల్పించాల్సిన యంత్రాంగం ఈ విషయంలో నిర్లిప్తంగా వ్యవహరిస్తోందనే విమర్శలున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓటరు నమోదుతో పాటు పోలింగ్ శాతం పెంచేందుకు సిస్టమెటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం కల్పించింది. ఇంటర్మీడియెట్, డిగ్రీ కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోనూ ఆట పాటల ద్వారా అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. తాజాగా జిల్లాలో ఇలాంటి కార్యక్రమాలేవి కన్పించడం లేదు. అధికారులతో సమావేశాలు నిర్వహించి సూచనలు చేసిన దాఖలు సైతం లేవు. ప్రజల్లో ప్రచారం కల్పించడం అటుంచితే ఓటరు నమోదు, పోలింగ్‌లో కీలకపాత్ర పోషించే రెవెన్యూ కార్యాలయాల్లోనూ ఎలాంటి చర్యలు కన్పించడం లేదు. ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన ఆదిలాబాద్, బోథ్ రిటర్నింగ్ అధికారులు ఇప్పటి వరకు ఈ దిశగా దృష్టి సారించకపోవడం గమనార్హం. కాగా ఈ విషయంపై ఆదిలాబాద్ ఆర్డీవో, రిటర్నింగ్ అధికారి బి.స్రవంతిని 'సాక్షి' ఫోన్ ద్వారా పలుమార్లు సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

ఈకేవైసీ నమోదు అంతంతే

- ఈనెల 29తో ముగియనున్న గడువు
- ఇప్పటి వరకు 77.78 శాతం మాత్రమే పూర్తి

కైలాస్‌నగర్: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన రేషన్ ఈకేవైసీ నమోదుకు మరో మూడు రోజులే గడువు మిగిలి ఉంది. గత నెల 31తోనే గడువు ముగిసినప్పటికీ చాలామంది కార్డుదారులు మిగిలి పోవడంతో ఈ నెల 29 వరకు పొడిగించింది. ఆ లోగా కార్డుదారులు తమ ఈకేవైసీ వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంది. అయితే ఇప్పటికీ చాలామంది కార్డుదారులు తమ వివరాలను నమోదు చేసుకోలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మరోసారి గడువు పొడిగిస్తుందా లేదా అనేదానిపై ఉత్కంఠ నెలకొంది. గడువులోగా అప్‌డేషన్ చేసుకోకుంటే బియ్యం పంపిణీ నిలిచిపోనుందని అధికారులు చెబుతుండటంతో తమ పరిస్థితేంటని మిగిలిన కార్డుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోసారి గడువు పెంచాలని కోరుతున్నారు.

1.41లక్షల మంది నమోదు చేసుకోలే..

జిల్లాలో ఇంకా 1,41,986 మంది సభ్యులు ఈకేవైసీ నమోదుకు దూరంగా ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,91,770 రేషన్ కార్డులుండగా వాటిల్లో 6,38,883 మంది సభ్యులున్నారు. వీరిలో ఇప్పటి వరకు 4,96,897 మంది కార్డుదారులు డీలర్ల ద్వారా తమ ఈకేవైసీ వివరాలు నమోదు చేసుకున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో నమోదు 77.78 శాతం మాత్రమే పూర్తయింది. నమోదు కాని వారిలో ఎక్కువగా వృద్ధులు, చిన్నపిల్లలే ఉన్నారు. ఆధార్ అప్‌డేషన్ చేసుకోలేని వారు కూడా కొంతమంది ఈకేవైసీ నమోదు చేసుకోలేకపోయారు. అయితే ప్రభుత్వం మరోసారి గడువు పొడిగించకుంటే వీరంతా నష్టపోయే అవకాశముంది. కార్డుదారులందరికీ ప్రయోజనం కల్పించాలని భావిస్తున్న కేంద్రం మరోసారి గడువు పొడిగించే అవకాశముందనే అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నప్పటికీ దానిపై ఇంకా ఎలాంటి స్పష్టత లేకపోవడం గమనార్హం.



వృద్ధుడి ఈకేవైసీ వివరాలు నమోదు చేస్తున్న డీలర్ (ఫైల్)

అంగన్‌వాడీ హెల్పర్స్ ఆందోళన



నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ హెల్పర్స్

కైలాస్‌నగర్: అంగన్‌వాడీ హెల్పర్లకు పాత పద్ధతిలోనే ఎస్సెస్సీ అర్హత ప్రకారం పదోన్నతులు కల్పించాలని, పదోన్నతి వయస్సును 50 ఏళ్లకు పెంచాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయు) డిమాండ్ చేసింది. సంఘం ఆధ్వర్యంలో ఆయాలు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు ఆశన్న, సునీత మాట్లాడుతూ.. అంగన్‌వాడీల్లో ఖాళీగా ఉన్న తొమ్మిది వేల పోస్టులను భర్తీ చేస్తామని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రకటించడం సంతోషకరమన్నారు.అయితే హెల్పర్లకు ప్రమోషన్ కల్పించే విద్యార్హతను ఎస్సెస్సీ నుంచి ఇంటర్మీడియెట్‌కు మార్చారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు చిన్నన్న, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు డి.వెంకటమ్మ, డి.సునీత, లక్ష్మి, ప్రియాంక , గంగమ్మ, యోగిత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయిలో జిల్లా విద్యార్థుల ప్రతిభ

ఆదిలాబాద్‌టౌన్‌: రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు డీఈవో ప్రణీత, జిల్లా సైన్స్‌ అధికారి రఘురమణ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ శాస్త్ర సాంకేతిక మండలి పర్యావరణ పరిరక్షణ, పరిశోధన స్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన సుస్థిర భవిష్యత్‌ కోసం సైన్స్‌ అనే అంశంపై రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. కవిత్వంలో సెయింట్‌ జోసెఫ్‌ కాన్వెంట్‌ పాఠశాలకు చెందిన సమాయెరా ఫాతిమా, పాటల విభాగంలో జెడ్పీఎస్‌ఎస్‌ జైనథ్‌ పాఠశాలకు చెందిన ప్రవళిక, ఉపన్యాసం పోటీల్లో అదే పాఠశాలకు చెందిన హరిప్రియలు రాణించినట్లు పేర్కొన్నారు. సైన్స్‌ దినోత్సవం రోజున వరంగల్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

దొంగ అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్‌: ఆదిలాబాద్‌ ఆర్టీసీ బస్టాండ్‌లో ఈనెల 22న బ్యాగ్‌ చోరీకి పాల్పడిన కెరమెరి మండలం సుర్దాపూర్‌కు చెందిన సయ్యద్‌ ఫయ్యాజ్‌ను అరెస్టు చేసినట్లు టూటౌన్‌ సీఐ అశోక్‌ తెలిపారు. బోథ్‌కు చెందిన సరిత ఆదిలాబాద్‌ ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు కోసం వేచి చూస్తోంది. ఈ క్రమంలో బస్సు రాగా సీట్‌ ఆపేందుకు బ్యాగ్‌ను అక్కడే వదిలేసి బస్సులోకి వెళ్లింది. తిరిగి చూసే సరికి బ్యాగ్‌ కనిపించకుండా పోయింది. దీంతో బాధితురాలు టూటౌన్‌లో ఫిర్యాదు చేసింది. సోమవారం పోలీసులు అనుమానంతో సయ్యద్‌ ఫయ్యాజ్‌ను విచారించగా విషయం ఒప్పుకున్నాడు. నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ వివరించారు.

ఇద్దరు ద్విచక్ర వాహనాల దొంగల అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్‌: ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడిన ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు వన్‌టౌన్‌ సీఐ సత్యనారాయణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్‌ జిల్లా తాంద్రకు చెందిన కాయిపాక రమేష్‌, కిన్వట్‌ తాలుకా కొటారికి చెందిన రఘునాథ్‌లు ఆదిలాబాద్‌ పట్టణంలో రెండు ద్విచక్ర వాహనాలను దొంగలించారు. మహారాష్ట్ర నుంచి ఆదిలాబాద్‌లో మరోసారి చోరీ చేసేందుకు జిల్లా కేంద్రానికి రాగా, సోమవారం తెలంగాణ చౌక్‌లో వాహనాల తనిఖీలు చేస్తున్న వన్‌టౌన్‌ ఎస్సై హబీబ్‌కు అనుమానం వచ్చి విచారించారు. ఈనెల 21న రిమ్స్‌ ఆస్పత్రి ఎదుట బైక్‌, శివాజీ చౌక్‌లో మరో ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. అదేవిధంగా వారి వద్ద ఉన్న వాహనాన్ని సైతం పూణె నుంచి దొంగలించినట్లు తెలిపారు. దీంతో వారిద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.


నీటి కోసం కాలినడకన వెళ్తున్న మహిళలు


గ్రామంలో ఏర్పాటు చేసిన సోలార్‌ విద్యుత్‌ సిస్టం


బిందెలతో నీళ్లు తీసుకెళ్తున్న మహిళలు

చెరువు నీరే దిక్కు...

అన్నీ ఉన్న అల్లుడి నోట్లో శని ఉందన్నట్లుగా మారింది ఏజెన్సీ ప్రాంతంలోని కొలాం గిరిజనుల పరిస్థితి. ఐటీడీఏ ఆధ్వర్యంలో కొలాం గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీవీటీజీ పేరుతో ప్రత్యేక పథకాల ద్వారా కోట్లాది రూపాయలు విడుదల చేస్తున్నప్పటికీ వారి బతుకుల్లో మాత్రం మార్పు రావడం లేదు. 80ఏళ్లుగా ఏజెన్సీ ప్రాంతంలో కొలాం గిరిజనులకు కనీసం గుక్కెడు తాగునీరు సైతం దొరకని దుస్థితి. అలాగే వారి గూడాలకు వెళ్లేందుకు కానరాని రోడ్లు.. విద్యుత్‌ సౌకర్యం లేక దుర్భర జీవనం సాగిస్తున్నారు. నేటికీ వారి గూడాల్లో మౌలిక వసతులు కల్పించడంలో పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. – నార్నూర్‌

- బిందెడు నీటి కోసం నాలుగు కిలోమీటర్లు..
- భీంపూర్‌ బొజ్జు కొలాంగూడ దుస్థితి
- పట్టించుకోని ఐటీడీఏ అధికారులు


చెరువులో మురికి నీటిని తోడుతున్న మహిళలు

నాలుగు కిలో మీటర్లు నడవాల్సిందే...

నార్నూర్‌ మండలంలోని భీంపూర్‌ గ్రామపంచాయతీ పరిధిలోని బొజ్జు కొలాంగూడ గ్రామంలో దాదాపు 15కొలాం గిరిజన కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేదు. బిందెడు నీటి కోసం దాదాపు నాలుగు కిలో మీటర్ల దూరంలోని చెరువు వద్దకు ఖాళీ బిందెలతో కాలినడకన వెళ్లాల్సిన దుస్థితి. చెరువులోని మురికి నీరు తాగడంతో రోగాల బారిన పడుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ గ్రామానికి విద్యుత్‌ సౌకర్యం లేదు. మూడు నెలల క్రితం ఈ గ్రామంపై సాక్షిలో వార్తను ప్రచురించగా స్పందించిన అప్పటి ఐటీడీఏ పీవో చాహత్‌ బాజ్‌పాయి, అధికారులు సోలార్‌ సిస్టం ఏర్పాటు చేశారు. రెండు లక్షల రూపాయలతో నీటి సౌకర్యం కోసం బోర్‌వెల్‌ మంజూరు చేసినా అధికారులు విద్యుత్‌ సౌకర్యం కల్పించడం మర్చిపోయారు. దీంతో బోర్‌వెల్‌ వృథాగా మారింది. ప్రస్తుతం గ్రామస్తులు కొలాం గిరిజనులు నీటి కోసం తంటాలు పడుతున్నారు. అధికారులు స్పందించి బొజ్జు కొలాంగూడకు నీటి సౌకర్యంతో పాటు మెరుగైన సదుపాయాలు కల్పించాలని స్థానికులు వేడుకుంటున్నారు.

చాలా కట్టంగా ఉంది



నీటి కోసం చాలా కష్టంగా ఉంది. బిందె నీటి కోసం నాలుగు కిలో మీటర్ల దూరం వెళ్తున్నాం. ఎండ ఎక్కువగా ఉండడంతో చెరువులో నీరు ఇంకిపోతోంది. నీటి కోసం చాలా కష్టంగా ఉంది. మురుగునీరు తాగుతుండడంతో రోగాలస్తున్నాయి. – **లేతుబాయి, బొజ్జు కొలాంగూడ**

కరెంట్‌ సౌలత్‌ లేదు



నీళ్ల కోసం బాగా గోసైతాది. రోజు రెండు పూటలు దూరం నుంచి నీటిని తీసుకొస్తున్నాం. పెద్ద సార్లు వచ్చింద్రు. బోర్‌వేల్‌ వేసింద్రు. కరెంటు సౌలత్‌ కల్పించలేదు. చాలా కట్టమైతంది. పెద్ద సార్లు మా వైపు చూడాలి. – **సీడం భీంబాయి, బొజ్జుగూడ**

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా..



టీడీఏ పీవో, ఈఈ ఆదేశాల మేరకు ఇప్పటికే నీటి సౌకర్యం కోసం దాదాపు రెండు లక్షలతో బోర్‌వేల్‌ వేయడం జరిగింది. కరెంట్‌ సౌకర్యం లేకపోవడంతో సోలార్‌ ఏర్పాటు చేశాం. బోర్‌వెల్‌కు విద్యుత్‌ సౌకర్యం గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తా. – **రాథోడ్‌ సునీల్‌, ఐటీడీఏ ఏఈ, ఉట్నూర్‌**

తీరు మారలే... ప్లాస్టిక్‌ను వదలలే


పర్యావరణానికి, ఆరోగ్యానికి హాని కలిగించే ప్లాస్టిక్‌ వాటర్‌ బాటిళ్ల వాడకాన్ని కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో పూర్తిగా నిషేధిస్తున్నట్లు కలెక్టర్‌ రాహుల్‌రాజ్‌ ఇటీవల అధికారుల సమక్షంలో వెల్లడించారు. అధికారులేవరూ వాటిని వాడొద్దని ఆదేశించారు. అయితే ఆ ఆదేశాలను అక్కడి సిబ్బంది విస్మరించినట్లున్నారు. సోమవారం జరిగిన ప్రజావాణిలో అధికారుల ముందు ప్లాస్టిక్‌ బాటిళ్లే దర్శనమివ్వడం అందుకు నిదర్శనం. – సాక్షి ఫొటోగ్రాఫర్‌, ఆదిలాబాద్‌

దాహార్తి తీర్చాలని వేడుకున్నా పట్టించుకోలేదు

- తుడుం దెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గోడం గణేష్‌


చేతి పంపును ప్రారంభిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్‌: మావల మండలంలోని బట్టి సావర్‌గాం శివారు ప్రాంతంలో కుమురంభీం కాలనీలో గుడిసేలు వేసుకుని నివాసముంటున్న ఆదివాసీ ప్రజల దాహార్తి తీర్చేందుకు బోరు బావులు వేయాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గోడం గణేష్‌ ఆరోపించారు. వేసవి సమీపిస్తున్న దృష్ట్యా కాలనీ ప్రజలు తాగు నీటికి ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉన్నందున ఇంటింటికీ చందాలు సేకరించి బోరు బావులు వేసుకుని చేతి పంపులు బిగించుకున్నారు. వాటిని సోమవారం తుడుం దెబ్బ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీసం చేతి పంపులు కూడా వేయడం లేదని గ్రహించి తుడుం దెబ్బ సౌజన్యంతో కాలనీలో చేతి పంపులు ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ రాష్ట్ర సహాయ కార్యదర్శి కుమ్ర శ్యాంరావ్‌, జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్‌, రాష్ట్ర మహిళ కార్యదర్శి గోడం రేణుకా, జిల్లా ఉపాధ్యక్షురాలు ఉయిక ఇంద్ర, మావల మండల అధ్యక్షుడు వెడ్మ ముకుంద్‌, మెస్రం తులసీరాం పటేల్‌, కుమ్ర గోవింద్‌రావ్‌, సెడ్మకి రాములు ఉన్నారు.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

ఆదిలాబాద్‌టౌన్‌: వ్యవసాయ భూమి తనకు కౌలుకు ఇవ్వలేదని హత్య చేసిన కేసులో ఒకరికి జీవిత ఖైదు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి డాక్టర్‌ సీహెచ్‌ వీఆర్‌ఆర్‌ వరప్రసాద్‌ సోమవారం తీర్పునిచ్చినట్లు లైజన్‌ అధికారి గంగాసింగ్‌ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. భీంపూర్‌ మండలం అర్లి(టి) గ్రామం శాంతినగర్‌కు చెందిన కుమ్ర భీంరావు, ఆత్రం అంకుష్‌లు బంధువులు. అంకుష్‌కు వ్యవసాయ భూమిని భీంరావు తనకు కౌలుకు ఇవ్వాలని కోరగా ఇవ్వకపోవడంతో పగ పెంచుకున్నాడు. 2023 జూలై 4న రాత్రి 7.30 గంటల ప్రాంతంలో అంకుష్‌ ఇంటి ఎదుట గొడవకు దిగాడు. దీంతో అంకుష్‌ను కత్తితో పొడిచి హత్య చేశాడు. చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకోగా అంకుష్‌ను తానే చంపానని ఒప్పుకుని పారిపోయాడు. భీంపూర్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు కాగా అప్పటి ఎస్సై రాధిక కేసు నమోదు చేశారు. పీపీ సంజయ్‌కుమార్‌ వైరాగ్రే 26మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. ఈ మేరకు జడ్జి తీర్పునిచ్చినట్లు వివరించారు.

కొనసాగుతున్న మల్లన్న జాతర


కుస్తీ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ముధోల్‌: మండలంలోని ఎడ్‌బిడ్‌ గ్రామంలో రెండు రోజులుగా సాగుతున్న మల్లన్న జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. సోమవారం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మల్లన్న ఆలయ ప్రాంగణంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుస్తీ పోటీల్లో నియోజకవర్గం నుంచే కాకుండా పక్క రాష్ట్రమైన మహారాష్ట్రలోని ధర్మాబాద్‌, నాందెడ్‌, కొండలవాడి, నర్సి, పుసత్‌, తదితర గ్రామాల నుంచి కుస్తీ పోటీల్లో పాల్గొనేందుకు మల్లయోధులు తరలివచ్చారు. భక్తులందరికీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మహాన్న దాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పోటీలను ఎమ్మెల్యే రామారావుపాటిల్‌ ప్రారంభించారు. గెలుపొందిన మల్లయోధుడికి ఎమ్మెల్యే మొదటి బహుమతి రూ.10వేలు, వెండి కడియం, రెండవ బహుమతి రూ.5వేలు, గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అందజేశారు. సీఐ మల్లేష్‌, ఎస్సై సాయికిరణ్‌ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

తలమడుగు: జిల్లాలో రబీ పంట సాగు చేస్తున్న రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. జిల్లాలో సహకార సంఘాలు, రువుల షాపుల ద్వారా విక్రయిస్తున్న యూరియా, ఇతర ఎరువుల కొరత లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులు యూరియా కొనుగోలు సమయంలో ఆధార్‌ కార్డు తప్పనిసరి తీసుకోరావాలని కోరారు. తలమడుగు సహకార సంఘం ద్వారా యాసంగిలో రూ.4కోట్ల ఎరువులు విక్రయించడం ఎంతో అభినందనీయమని సీఈవో మోతే శ్రీనివాస్‌ను, సిబ్బందిని కొనియాడారు. అనంతరం సహకార సంఘం జిల్లా అధికారి మోహన్‌ మాట్లాడుతూ ఆర్థిక భారం తగ్గించేందుకు ఎరువుల విక్రయాలు పంటల కొనుగోలు చేపడుతున్నామన్నారు. మండల వ్యవసాయ అధికారి మహేందర్‌, సీఈవో శ్రీనివాస్‌, సెక్రటరీలు సాగర్‌, గంగయ్య, భీమ్‌రావు ఉన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి


ఉమాజి మృతదేహం

ఇచ్చోడ: మండలంలోని రాజీ జిన్నింగ్‌ ఫ్యాక్టరీ ఎదుట సోమవారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో ఉమాజీ జాదవ్‌ (33) మృతి చెందాడు. ఎస్సై నరేష్‌ తెలిపిన వివరాల ప్రకారం... చంద్రపూర్‌ జిల్లాకు చెందిన ఉమాజీ సమీప బంధువుల పెళ్లి పత్రికలు ఇచ్చేందుకు ఆదివారం నిర్మల్‌ జిల్లా సారంగపూర్‌ మండలంలోని నాఖతాండకు వచ్చాడు. సోమవారం ఉదయం బైక్‌పై బయలుదేరాడు. ఉదయం 9గంటల ప్రాంతంలో జాతీయ రహదారిపై వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఉమాజీ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బావమరిది శంకర్‌ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

యువకుడి ఆత్మహత్య

కుంటాల: మండలంలోని అంబకంటి గ్రామానికి చెందిన పొన్నవేని చందు(31)ఆదివారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై దేవ్‌రావు కథనం ప్రకారం... చందు భార్య అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఇటీవల ఆపరేషన్‌ చేయించాడు. ఆపరేషన్‌ కోసం చేసిన అప్పులు తీర్చలేక జీవితంపై విరక్తితో ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్యతో పాటు కూతురు, కుమారుడు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ముగ్గురి రిమాండ్‌

బజార్‌హత్నూర్‌: మండలంలోని దిగ్నూర్‌ గ్రామంలో గిరజాబాయి, వారి కుటుంబ సభ్యులపై ఈ నెల 24న జరిగిన కత్తి దాడిలో పాల్గొన్న అదే గ్రామానికి చెందిన చోలే నందకుమార్‌, కేంద్రే గంగాధర్‌, కేంద్రే వినాయక్‌లను సోమవారం అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై నరేష్‌ తెలిపారు. డీఎస్పీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో కేసు విచారణ చేపట్టి 24గంటల్లోనే నిందితులను పట్టుకుని రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ఈ కేసు ఛేదించిన వారిలో ఆదిలాబాద్‌ టూటౌన్‌ సీఐ అశోక్‌, రూరల్‌ సీఐ సైదారావ్‌, బజార్‌హత్నూర్‌, బోథ్‌ ఎస్సైలు నరేష్‌, రాము ఉన్నారు.

మరొకరి రిమాండ్‌

ఆదిలాబాద్‌టౌన్‌: పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన ఉద్ధవ్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్‌ సీఐ అశోక్‌ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సుందరయ్యనగర్‌కు చెందిన ఉద్ధవ్‌ మద్యానికి బానిసయ్యాడు. ఇద్దరు కుమారులు కూలీ పనిచేస్తుండగా వారి వద్ద నుంచి డబ్బులు తీసుకునేవాడు. ఈ క్రమంలో ఆదివారం గొడవపడి కేఆర్‌కే కాలనీలో అద్దెకు ఉంటానని వెళ్లిపోయాడు. సాయంత్రం తిరిగి వచ్చి డబ్బులు కావాలని మళ్లీ గొడవకు దిగాడు. కత్తితో తన కుమారులు సూర్యవంశీ శాంతికుమార్‌, ఆకాష్‌లపై దాడికి యత్నించాడు. దీంతో ఆకాష్‌ చేతికి గాయాలయ్యాయి. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఆర్టీసీకి కలిసొచ్చిన జాతర

- జిల్లాలో నడిచిన బస్సులు 342
- ఫిబ్రవరి 18 నుంచి 24వరకు రాకపోకలు
- భక్తులను చేరవేయడం ద్వారా రూ.3కోట్ల పైనే రాబడి
- మహా శివరాత్రిపై ప్రత్యేక దృష్టి


మంచిర్యాల బస్‌స్టేషన్‌లో బస్సులు

మంచిర్యాలఅర్బన్‌: మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర ఆర్టీసీకి కలిసొచ్చింది. ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాకు చెందిన ఆదిలాబాద్‌ రీజియన్‌లో అన్ని డిపోలకు చెందిన అధికార యంత్రాంగం అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంది. మేడారానికి ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి బస్సులు నడిపించారు. మంచిర్యాల జిల్లా నుంచి మేడారం జాతరకు అత్యధికంగా భక్తులు వెళ్లడాన్ని గ్రహించిన ఆర్టీసీ యాజమాన్యం ముందస్తు కార్యాచరణ సిద్ధం చేసుకుంది. రీజినల్‌ మేనేజర్‌ సోలోమాన్‌ ఆయా డిపోల మేనేజర్లతో సమన్వయం చేసుకుంటూ ఆదాయాన్ని పెంచుకోవడానికి చేసిన ప్రయత్నాలు ఊరటనిచ్చాయి. ఫిబ్రవరి 18 నుంచి 24వరకు జాతరకు మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు, మందమర్రి, శ్రీరాంపూర్‌లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి ఆయా డిపోల డీఎంలు పర్యవేక్షిస్తూ బస్సులు నడిపించారు. ఆదిలాబాద్‌ రీజియన్‌ నుంచి మొత్తం 342 బస్సులు నడిపి 72,108 మంది ప్రయాణికులను చేరవేశారు. తద్వారా రూ3,41,51,898 రాబడి వచ్చింది.

ప్రత్యేక బస్సులతో..

ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపి అనుకున్న లక్ష్యాన్ని సాధించారు. 342 బస్సులను 6,13,739 కిలోమీటర్ల మేర తిప్పారు. 59శాతం ఆక్యుపెన్సీ రేషియో(ఓఆర్‌) సాధించారు. 72,108 మంది భక్తులను గమ్యస్థానాలకు చేర్చారు. ఇందులో టికెట్‌ ధర చెల్లించిన ప్రయాణికులంటే మహలక్ష్మి ప్రయాణికులే ఎక్కువగా ఉన్నారు. టికెట్‌ ధర చెల్లించి ప్రయాణం చేసిన వారు 33,084 మంది కాగా 39,024 మంది మహలక్ష్మి ప్రయాణికులున్నారు. మంచిర్యాల డిపో నుంచి నడిపిన బస్సుల ద్వారా రూ.1,05,31,88 ఆదాయం సమకూరింది. ఆదిలాబాద్‌ డిపోకు చెందిన బస్సుల(చెన్నూర్‌ పాయింట్‌) ద్వారా 13,946 మంది ప్రయాణికులను, భైంసా డిపో బస్సుల(శ్రీరాంపూర్‌ పాయింట్‌) ద్వారా 16,692 మంది భక్తులను, నిర్మల్‌ డిపో బస్సుల(మందమర్రి పాయింట్‌) ద్వారా 9,471 మందిని, ఆసిఫాబాద్‌ డిపో బస్సుల (బెల్లంపల్లి, ఆసిపాబాద్‌ పాయింట్లు) ద్వారా 7,321 మంది భక్తులు, మంచిర్యాల డిపో బస్సుల ద్వారా(మంచిర్యాల బాలుర ఉన్నత పాఠశాల మైదానం నుంచి) 24,678 మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చారు.

డిపో	బస్సులు	కిలోమీటర్లు	ఆదాయం(రూ.లలో)	'మహలక్ష్మి' ప్రయాణికులు	పెయిడ్‌ ప్రయాణికులు
ఆదిలాబాద్‌	65	1,24,405	67,99,504	7391	6555
భైంసా	40	72,509	41,72,312	9014	7678
నిర్మల్‌	58	86818	51,80,271	5020	4451
ఆసిఫాబాద్‌	72	1,36,321	74,67,923	4027	3294
మంచిర్యాల	107	191686	1,05,31,888	13573	11105

ఇక్కట్లు లేకుండా బస్సులు నడిపాం

మేడారం జాతర సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు, అధికారులంతా సమన్వయంతో పనిచేశారు. జాతర వెళ్లే భక్తులకు ఎక్కడా ఇక్కట్లు ఎదురు కాకుండా చూశాం. మంచిర్యాల–మేడారం–మంచిర్యాలకు దాదాపు 72 వేల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేశాం. మహాశివరాత్రి నేపథ్యంలో మంచిర్యాల జిల్లా కేంద్రం నుంచి వేలాల, బుగ్గ, నిర్మల్‌ నుంచి వేములవాడకు ప్రత్యేక బస్సులు నడిపేందుకు సన్నద్ధం అవుతున్నాం. రద్దీని బట్టీ ఆయా పుణ్యక్షేత్రాలకు బస్సులను నడిపించేందుకు చర్యలు చేపట్టాం. – **సోలోమాన్‌రాజ్‌, రీజినల్‌ మేనేజర్‌ ఆదిలాబాద్‌**

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఇచ్చోడ: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి పరిస్థితి విషమించి మృతిచెందాడు. ఎస్సై నరేశ్‌ వివరాల ప్రకారం... మండలంలోని ధర్మంపురి గ్రామానికి చెందిన సోయం శంకర్‌ (31) కుటుంబ కలహాలతో ఆదివారం ఉదయం 10.30 గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారకస్థితిలో పడిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి 108లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. మృతుడి తల్లి సోయం మోతిబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు

- డీడీ దిలీప్‌కుమార్‌


అర్జీలు స్వీకరిస్తున్న డీడీ దిలీప్‌కుమార్‌

ఉట్నూర్‌రూరల్‌: గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని డీడీ దిలీప్‌కుమార్‌ అన్నారు. ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనులు తమ సమస్యలను పరిష్కరించాలంటూ అర్జీలను అందజేశారు. తలమడుగు మండలం దుర్గాపూర్‌ గ్రామానికి చెందిన నైతం రమణ తనకు బోరుబావి ఇప్పించాలని, గుడిహత్నూర్‌ మండలం మన్నూర్‌ గ్రామానికి చెందిన కనక లాలురాం ఇల్లు మంజూరు చేయాలని, ఆదిలాబాద్‌ మండలం అంఖాపూర్‌ గ్రామానికి చెందిన సిడాం సచిన్‌ ఎడ్ల జత కావాలని, తలమడుగు మండలం లక్ష్మీపూర్‌ గ్రామానికి చెందిన తుకారాం జనరల్‌ స్టోర్‌ ఏర్పాటు చేయించాలని కోరాడు. అలాగే పలువురు పింఛన్‌, రెండు పడకల గదుల ఇల్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలంటూ దరఖాస్తులు సమర్పించారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డీడీ సూచించారు. ప్రజావాణిలో ఏపీవో కనకరరావు, ఏడీఎంహెచ్‌వో కుమ్ర బాలు, ఏవో రాంబాబు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్‌, పీహెచ్‌వో సందీప్‌ ఉన్నారు.